# జేఎన్‌టీయూహెచ్‌లో ముగిసిన ఐడియా థాన్




విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్న వీసీ కిషన్ కుమార్ రెడ్డి,

బాలానగర్: వాస్తవ సమస్యలను గుర్తించి వాటికి పరిష్కార మార్గాలు కనుగొనడమే స్టార్టప్‌లు లక్ష్యంగా పెట్టుకోవాలని జేఎన్‌టీయూహెచ్ వీసీ టి. కిషన్ కుమార్ రెడ్డి అన్నారు. వర్సిటీలో నిర్వహించిన ఐడియా రిఫైన్‌మెంట్ బైట్ క్యాంప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ ఆవిష్కరణలు పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న వెంచర్ క్యాపిటల్, పెట్టుబడి అవకాశాలపై వివరించారు. ఐడియా థాన్‌లో విజేతలైన ముగ్గురికి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి: వీసీ




విద్యార్థులకు చెక్కులు అందిస్తున్న టీకేకే రెడ్డి

కూకట్‌పల్లి, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థులు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జేఎన్‌టీయూ వీసీ డాక్టర్ టి.కిషన్‌కుమార్‌రెడ్డి అన్నారు. జే-టీబీఐ ఆధ్వర్యంలో రెండు రోజుల ఐడియాథాన్-26 ముగింపు కార్యక్రమంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. విద్యార్థుల్లోని ఆలోచనలకు కార్యరూపం ఇచ్చేందుకు వర్సిటీలో ప్రత్యేక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. స్టార్టప్‌లకు కావాల్సినంత ప్రోత్సాహం ఇవ్వడానికి తాము, అలుమ్ని సభ్యులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఐడియాథాన్‌లో మొత్తం 30 బృందాలు పాల్గొనగా.. 15 బృందాల ఆలోచనలు తుదిదశకు చేరగా.. ఇందులో ముగ్గురిని విజేతలుగా ప్రకటించారు. మహబూబాబాద్ కళాశాల నుంచి 'క్రిషి 1.0' ఆలోచనతో అభిజ్ఞ బృందం మొదటిస్థానంలో నిలవగా రూ.10వేలు, సుల్తాన్‌పూర్ కళాశాలకు చెందిన కొండబత్తుల శివభావి బృందం 'సెంటినెల్ ఏఐ' ఆలోచన ద్వితీయ స్థానంలో నిలిచి రూ.8వేలు, వర్సిటీ క్యాంపస్‌కు చెందిన మనోజ్ పెనుమాకుల బృందం 'మీ సంపూర్ణ ఫిట్‌నెస్ జీవనశైలి కోసం ఒకే సభ్యత్వం' ఆలోచన తృతీయ స్థానంలో నిలిచి రూ.7వేల నగదు బహుమతులు గెలుచుకున్నారు. వర్సిటీ క్యాంపస్ విద్యార్థిని శ్రీదక్షిత బృందం 'ఓర్కా నెట్‌వర్క్' ఆలోచనను జ్యూరీ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. వర్సిటీ క్యాంపస్ విద్యార్థులు లక్ష్మీనివాస్, సాయికుమార్ స్టార్టప్ కే అండ్ ఆర్ మోటొరాడ్, దివ్యాంగులకు శాస్త్రీయ పరిష్కారాలను అందించే రంగంలో పనిచేసేందుకు ఫ్రెనిక్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ స్టార్టప్ కంపెనీ వ్యవస్థాపకులు సుదర్శన్, క్రాంతికి అలుమ్ని ప్రతినిధులు ఒక్కొక్క కంపెనీకి రూ.4 లక్షల చొప్పున రూ.8లక్షల నిధులు సమకూరుస్తూ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.వి.నరసింహారెడ్డి చెక్కులు అందజేశారు. జే-టీబీఐ డైరెక్టర్ ప్రొ.ఆశారాణి, ఎంఓఈ ఇన్నోవేషన్ సెల్ ప్రతినిధి డా.భీమారెడ్డి, ప్లూరల్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సునీల్ సవరం, జే-టీబీఐ సీఈవో రాకేష్, ప్రోగామ్ మేనేజర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

# టీజీఐసెట్‌లో 23,988 సీట్లు భర్తీ

- ఎంబీఏలో 20,889..
- ఎంసీఏలో 3,099 సీట్లు అలాట్

**హైదరాబాద్, వెలుగు:** రాష్ట్రంలోని ఎంబీఏ, ఎంసీఏ కాలేజీల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన టీజీఐసెట్ 2026 ఫైనల్ ఫేజ్ కౌన్సెలింగ్‌లో 23,988 సీట్లు భర్తీ అయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 414 కాలేజీల్లో అందుబాటులో ఉన్న 38,462 సీట్లకు ఈ కేటాయింపులు చేసినట్టు టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఏ. శ్రీదేవసేన శుక్రవారం తెలిపారు. ఎంబీఏలో 31,181 సీట్లకు గాను 20,889 (67 శాతం) సీట్లు భర్తీ అయ్యాయి. ఎంసీఏలో 7,281 సీట్లకు గాను 3,099 (43 శాతం) సీట్లు మాత్రమే నిండాయి. ఫైనల్ ఫేజ్ ముగిసినా మొత్తం 14,474 సీట్లు ఖాళీగా ఉన్నాయి. సీట్లు పొందిన అభ్యర్థులు ఈనెల 24లోపు ఆన్‌లైన్‌లో ట్యూషన్ ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్, 25లోపు కేటాయించిన కాలేజీల్లో రిపోర్ట్ చేయాలని అధికారులు సూచించారు. వివరాలకు https://tgicet.nic.in చూడాలని తెలిపారు. టీజీపీఈసెట్ రెండో విడత సీట్ల కేటాయింపు పూర్తయింది. కన్వీనర్ కోటాలో 1,173 సీట్లు అందుబాటులో ఉండగా.. 891 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. 661 మందికి సీట్లు కేటాయించారు. 27లోపు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాల్సి ఉంది.